సాక్షి విశాఖపట్నం

మంగళవారం ı 9 ı ఏప్రిల్ ı 2024



మహిళా శక్తికి చేయూత

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'వైఎస్సార్ చేయూత' పథకం అండగా నిలుస్తోంది. 2లో



ఆస్పత్రుల్లో వసతుల కల్పన

ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, తాగునీరు, మందులు, అత్యవసర అనుమతులపై కలెక్టర్ మల్లికారున దిశానిర్దేశం చేశారు. 2లో

నేడు అప్పన్న పెళ్లిరాట



ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి పెళ్లిరాట(ఉడుపు రాట) మహోత్సవం జరగనుంది. 2లో

ఉగాది ఉషస్సు







కొత్త.. అనే మాటలోనే ఎక్కడలేని కొత్తదనం! కొత్త పంచాంగం, కొత్త బెల్లం, కొత్త మామిడి పిందెలు, కొత్త వేపపూత. ప్రకృతి సైతం కొత్తగా ముస్తాబవుతుంది. ఉగాది ఉషస్సు.. మహా నగరానికి సరికొత్త కాంతులద్దింది. పచ్చి మామిడికాయలు, చెరకు గడలు, కొత్త బెల్లం, చింతపండు, వేప పూతల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. కొత్త దుస్తులు ఖరీదు చేసే వినియోగదారులతో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. ఉగాది పచ్చడి తయారు చేసేందుకు అవసరమైన కొత్త కుండల కోసం జనాలు ఎగబడ్డారు. నగరంలోని పలు చోట్ల పూలు, పండ్ల సముదాయాలు వెలిశాయి. పంచాంగం పుస్తకాలను కొనుగోలు చేయడానికి పండితులు ఆసక్తి చూపారు..

– ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆనందాలు వెల్లివిరియాలి

కలెక్టర్ మల్లికార్జున, జేసీ ఆకాంక్ష

మహారాణిపేట: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదంతా ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని, సిరిసంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఉగాదిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.





కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న పూర్ణామార్కెట్

అంటే.. 'సుందరా'నికీ..!

- విజయకుమార్‌పై పవన్‌కు చిన్నచూపు అంటున్న జనసేన క్యాడరు
- తొలుత టికెట్ కేటాయింపుపై మీనమేషాలు
- తీరా ప్రకటించాక సీటు మార్చేందుకు యత్నాలు
- వారాహియాత్రలో యలమంచిలి సభ ఔట్
- అనకాపల్లి సభలో ఆయన పేరు ప్రస్తావనకే ఇష్టపడని కల్యాణ్
- ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో సుందరపు వర్గీయులు



సాక్షి, విశాఖపట్నం : జనసేన యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు కాలం కలిసి రావడం లేదు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబులకు అత్యంత సన్నిహితులమని హడావుడి చేసే ఆయనకు వారి నుంచే ఆశించిన ఆదరణ కనిపించడం లేదు. యలమంచిలి టికెట్ తనదేనని ఎప్పట్నుంచో చెప్పుకుంటున్న విజయకుమార్‌కు సీటు కేటాయింపులోనూ ఆలస్యమే జరిగింది. తీరా టికెట్ ఖరారు చేశాక కూడా మార్పు చేసేందుకు అధిష్టానం స్థాయిలోనే ప్రయత్నాలు జరిగాయి. ఏదోలా ఆ గండం నుంచి గట్టెక్కామనుకుంటున్న తరుణంలోనూ ఆయనకు ప్రశాంతత ఉండడం లేదు. తాజాగా అనకాపల్లిలో జరిగిన పవన్ కల్యాణ్ ఎన్నికల సభలో చోటు చేసుకున్న పరిణామం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ సభలో పవన్.. అనకాపల్లి, పెందుర్తి అభ్యర్థులతో పాటు అక్కడెక్కడ నుంచో పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్, మండలి బుద్ధ ప్రసాద్‌లను గెలిపించాలని కోరారు తప్ప ఆ పక్క నియోజకవర్గం యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ గురించి ప్రస్తావించనే లేదు. అంతేకాదు.. తన వారాహి వాహనంపైకి జనసేన అనకాపల్లి, పెందుర్తి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి బుద్దా నాగ జగదీష్‌లను ఆహ్వానించారే గాని విజయకుమార్‌కు అవకాశం ఇవ్వలేదు. తనను వారాహిపైకి పిలుస్తారని ఎదురు చూసిన ఆయనకు తీవ్ర నిరాశే ఎదురైంది. పైగా అభ్యర్థికాని నాగ జగదీష్‌కు చోటివ్వడంతో విజయకుమార్‌తో పాటు ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేకాదు.. తొలుత ప్రకటించిన షెడ్యూల్‌లో సోమవారం యలమంచిలిలో పవన్ సభ ఉంది. కానీ అనారోగ్యం పేరిట అనూహ్యంగా దానిని రద్దు చేసుకుని అటు నుంచి అటే హైదరాబాద్ వెళ్లిపోయారు.

మార్పు తప్పదా?

ఇదంతా ఉద్దేశపూర్వకంగానే చేశారన్న అనుమానం జనసేన శ్రేణుల్లో బలంగా నాటుకుపోయింది. ఎందుకంటే.. యలమంచిలి జనసేన సీటును మారుస్తారన్న ప్రచారం కొన్నాళ్లుగా జోరుగా సాగుతోంది. పెందుర్తి సీటును పంచకర్లకు అధికారికంగా కేటాయించినా ఆ స్థానాన్ని తనకు ఇవ్వాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి గట్టిగా పట్టుపడుతున్నారు. టీడీపీ నాయకులు బుజ్జగించినా ఆయన తగ్గేదే లే అంటున్నారు. తన అనుచరులతో రోజూ రోడ్డెక్కించి ఆందోళనలు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో యలమంచిలి సీటు నుంచి విజయకుమార్‌ను తప్పించి పంచకర్లకు ఇస్తారని, పెందుర్తి టికెట్‌ను బండారుకు కేటాయిస్తారన్న ప్రచారం బాగా ఊపందుకుంది. తాజాగా పవన్ కల్యాణ్ వ్యవహార శైలి అందుకు అనుగుణంగా ఉండడం వీరి ప్రచారానికి బలం చేకూరుతోంది. ఆది నుంచీ సుందరపుపై పవన్‌కు చిన్న చూపేనన్న అనుమానం ఆయన వర్గీయుల్లో ఉంది. అందుకనుగుణంగానే తాజా పరిణామాలుండడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది.

రైల్వేస్టేషన్‌లో కుంగిన పాదచారుల వంతెన

- తప్పిన పెను ప్రమాదం.. వంతెన మూసివేత
- నేడు అందుబాటులోకి తీసుకువస్తామన్న డీఆర్ఎం



ప్లాట్‌ఫాంలపై రాకపోకల నిషేధం



కుంగిన పాదచారుల వంతెన

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మూడో నెంబర్ గేట్ నుంచి స్టేషన్‌లోకి ప్రవేశించే పాదచారుల వంతెన సోమవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కుంగింది. దీంతో కింద ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ గానీ, రైళ్లు గానీ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ వంతెన మీదుగా ప్రయాణికుల రాకపోకలను నిషేధించారు. విషయం తెలుసుకున్న డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఉన్నతాధికారులతో సమీక్షించి పునరుద్ధరణ పనులు ప్రారంభించామని తెలిపారు. మూడు, నాల్గవ నంబర్ ప్లాట్‌పాంల నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 4, 5 ప్లాట్‌ఫాంలలో కొత్త లిఫ్టులను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ పునరుద్ధరణ పనులు మంగళవారం ఉదయం 8 గంటలకు పూర్తిచేస్తామన్నారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్పీఎఫ్) అజయ్‌ప్రకాష్ దూబే కూడా రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆర్పీఎఫ్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

30లోగా చెల్లించేవారికి అవకాశం

డాబాగార్డెన్స్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 30వ తేదీలోగా ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుల కోసం ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో ఉన్న సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం సెలవు రోజుల్లో కూడా సౌకర్యం కేంద్రాలు పని చేస్తాయన్నారు. https://www.gvmc.gov.in/ జీవీఎంసీ వెబ్‌సైట్ ద్వారా, జీవీఎంసీ సౌకర్యం కేంద్రం, ఐడీబీఐ సిరిపురం బ్రాంచి, ఐసీఐసీఐ ద్వారకానగర్ బ్రాంచి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధురవాడ బ్రాంచి, యాక్సిస్ బ్యాంక్ రామ్‌నగర్ బ్రాంచిలతో పాటు అన్ని సచివాలయాల్లోనూ నగదు/డీడీ/డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా కూడా పన్నులు చెల్లించి 5 శాతం రాయితీ(ఎర్లీ బర్డ్ ఆఫర్)ను పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

నేడు చిల్డ్రన్ ఎరీనాలో ఉగాది వేడుకలు

మహారాణిపేట: ఉగాది వేడుకలను వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో మంగళవారం నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్ పాల్గొంటారన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమై 11 గంటలతో ముగుస్తాయన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో జిల్లా అధికారులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. పంచాంగ పఠనం, వేద పండితులు, అర్చకులకు సత్కారం, ఉగాది పచ్చడి పంపిణీ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో...

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ వేడుకలు జరగనున్నాయి. శ్రీమద్రామాయణం, ప్రవచనాలు, పంచాంగ శ్రవణం చేయనున్నారు. విశాఖలో ఆర్అండ్‌బీ అప్పయ్య నగర్‌లోని శ్రీ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, అనకాపల్లి జిల్లా బాటజంగాలపాలెంలోని రామాలయం, అల్లూరి జిల్లా చింతలపూడిలోని రామాలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు.

మైసూరు-భువనేశ్వర్ స్పెషల్

తాటిచెట్లపాలెం : మైసూరు–భువనేశ్వర్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేరు డివిజన్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. మైసూరు–భువనేశ్వర్(06215) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9న మైసూర్‌లో ఉదయం 4.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడకు.. అదేరోజు ఉదయం 10.40 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–మైసూరు(06216) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడకు.. మరుసటి రోజు రాత్రి 7.15 గంటలకు మైసూరు చేరుకుంటుంది.

'షూ'టయ్యేలా..!

- విద్యార్థుల పాదాల కొలతల సేకరణ
- బడితెరిచిన తొలిరోజునే విద్యాకానుక
- తొమ్మిది రకాల వస్తువులతో ప్రత్యేక కిట్ అందజేత
- ప్రతీ విద్యార్థికి రూ.1,964 వ్యయంతో విద్యాకానుక, ఇది మార్కెట్‌లో రూ.5 వేలు పైమాటే..



అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల పాదాల కొలతలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు



గతేడాది కానుక అందుకున్న విద్యార్థి

విశాఖ విద్య: విద్యారంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. పేద బిడ్డలు సైతం కార్పొరేట్ స్కూళ్లకు వెళ్లే వారికి మించి టిప్పుటాప్‌గా ఉండాలనే తపనతో విద్యాకానుక రూపంలో యూనిఫారాలు ఉచితంగా అందజేస్తోంది. వీటితో పాటు షూ, రెండు జతల సాక్స్‌లను ఏటా విద్యార్థులకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2024–25 విద్యా సంవత్సరానికి బడితెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు విద్యాకానుకను అందజేసేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, వివాదాలకు తావులేకుండా కానుకలోని వస్తువులను సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా కానుక

ప్రతీ విద్యార్థి పాదాల సైజుకు అనుగుణంగానే బూట్లను పాఠశాలలకు సరఫరా చేసేలా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా జిల్లాలోని పాఠశాలల వారీగా విద్యార్థుల పాదాల కొలతలను సేకరిస్తున్నారు. పాఠశాలల హెచ్ఎంల పర్యవేక్షణలో విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో విద్యార్థుల పాదాల కొలతల వివరాలను పొందుపరుస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మేరకు, వారి పాదాల సైజులకు అనుగుణంగానే బూట్లు , సాక్స్‌లను సరఫరా చేయనున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో కానుకలను ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖాధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

సిద్ధమవుతున్న పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు 8.91 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం. వచ్చే విద్యా సంవత్సరానికి అంతా సన్నద్ధమవుతున్న తరుణంలో బడి తెరిచిన తొలిరోజునే పాఠ్యపుస్తకాలు విద్యార్థుల చేతికిచ్చేలా అధికారులు దృష్టి సారించారు. సెమిస్టర్ల వారీగా పుస్తకాలు సరఫరా చేస్తున్నందున, మొదటి దఫాగా ఇవ్వాల్సిన పుస్తకాలు ముద్రణ ఇప్పటికే ప్రారంభించారు. దీనిపై 2023–24 విద్యా సంవత్సరం గణాంకాల మేరకు ముందస్తు అంచనాలతో పుస్తకాల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 1.01 లక్ష మందికి ప్రయోజనం

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 587 స్కూళ్లలో చదువుతున్న 1.02 లక్షల మందికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా విద్యాకానుక అందజేస్తున్నారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యా సంవత్సరానికి కూడా విద్యార్థులందరికీ విద్యాకానుక అందించాలనేది ప్రభుత్వ ముందస్తు నిర్ణయం. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు కానుకలను రెడీ చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్, బెల్టులు, బూట్లు, సాక్స్, మూడు జతల యూనిఫారాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, విద్యా డిక్షనరీతో కలిపి తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్ ఇస్తున్నారు.

ఏటా రూ.20 కోట్ల వ్యయం

రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టెండర్ ప్రక్రియలో భాగంగా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక కిట్‌కు ప్రభుత్వం రూ.1,964లు వ్యయం చేస్తోంది. బయట మార్కెట్‌లో దీనికి రూ.5 వేలుకు పైనే ఉంటుంది. జిల్లాలోని విద్యార్థులకు పంపిణీ చేసే నిమిత్తం ఏటా రూ.20 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చుచేస్తూ వచ్చింది. ఈ లెక్కన నాలుగు దఫాలుగా రూ.80 కోట్లతో జిల్లాలోని విద్యార్థులకు విద్యాకానుకను ప్రభుత్వం అందజేసిందన్నమాట. ఇదే బయట మార్కెట్‌ను పరిగణలోకి తీసుకుంటే, రూ.200 కోట్లపైనే ఉంటుంది. ఈ రీతిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది.

మహిళా శక్తికి చేయూత

పథకం	ఏటా లబ్ధి	జిల్లాలో లబ్ధిదారులు
వైఎస్సార్ చేయూత	రూ.18,750	5,98,712
	నాలుగేళ్లలో చేకూరిన లబ్ధి రూ.1122.58 కోట్లు	



అక్కచెల్లెమ్మల జీవితాల్లో 'వైఎస్సార్ చేయూత' పథకం వెలుగులు నింపుతోంది. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల మహిళలకు ప్రభుత్వం ఏటా రూ.18,750 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. నాలుగేళ్లలో రూ.75,000లను అందిస్తోంది.

- విశాఖ జిల్లాలో 5,98,712 మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి
- నాలుగు విడతల్లో రూ.1122.58 కోట్ల జమ
- జగనన్న ప్రభుత్వంపై లబ్ధిదారుల ప్రశంసల జల్లు





లబ్ధిదారులకు చేయూత అందజేస్తున్న ఉన్నతాధికారులు(ఫైల్)

ఎంవీపీకాలనీ: జిల్లాలో ఇప్పటివరకు వైఎస్సార్ చేయూత పథకంలో 5,98,712 మందికి రూ.1122.58 కోట్లు ప్రభుత్వం అందించింది. 'వైఎస్సార్ చేయూత' పథకం జిల్లా వాసులకు కొండంత భరోసా కలిగించింది. ఆర్థిక ఇబ్బందులతో అప్పుల అగాథంలోకి జారిపోతున్న ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపింది. కొందర్ని చిన్న మొత్తాల పెట్టుబడితో వ్యాపారం వైపు నడిపించింది.

జిల్లాలో 5,98,712 మందికి లబ్ధి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగు విడతలుగా చేయూత నిధులను మంజూరు చేసింది. నాలుగు విడతల్లో కలిపి 5,98,712 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణ, గాజువాక, భీమిలి, పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాగా పరిగణించి లబ్ధిదారులైన మహిళలకు నాలుగు విడతల్లో ఈ నగదును విడుదల చేశారు. ఇందులో భాగంగా 2020–21కు గాను తొలివిడతగా 2,10,405 మంది మహిళలకు, 2021–22లో 2,17,195 మందికి మహిళలకు, 2022–23లో 86,434 మందికి, 2023–24లో 84,678 మంది మహిళలకు చేయూత ద్వారా లబ్ధి చేకూరింది.

జిల్లాకు రూ.1122.58 కోట్లు

వైఎస్సార్ చేయూత ద్వారా రాష్ట్రంలో 45 నుంచి 65 ఏళ్ల వయసున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు రూ.18,750 ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ఇప్పటికే నాలుగు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా జిల్లాకు ఈ పథకం ద్వారా రూ.1,122.58 కోట్లు విడుదల చేసింది. 2023–24 ఏడాదికి గాను రూ.158.77 కోట్లు ప్రభుత్వం విడుదల చేయగా ఆయా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా జరుగుతోంది.

కుటుంబాన్ని నిలబెట్టింది



నాది 21వ వార్డు చినవాల్తేర్ ప్రాంతం. వైఎస్సార్ చేయూత ద్వారా మా కుటుంబానికి మంచి జీవనాధారం లభించింది. 2019 వచ్చిన కోవిడ్ కారణంగా చేసుకునేందుకు పనులు లేకుండా ఇంటికే పరిమితం కావాల్సివచ్చింది. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకంతో లబ్ధి పొందా. దీంతో తొలివిడత లభించిన నిధులతో కుటుంబ జీవనానికి అనుగుణంగా కొత్త వ్యాపారం ప్రారంభించాం. చినవాల్తేర్ కూడలిలో రోడ్డు పక్కన టిఫిన్ షాపు పెట్టుకున్నాం. దీనిలో మా అబ్బాయి నేను పనిచేసుకుంటూ ఆర్థికంగా భరోసా పొందుతున్నాం. ఇప్పటి వరకు మూడు విడతల్లో నిధులు అందుకున్నాం. త్వరలోనే నా ఖాతాలోకి 4వ విడత నిధులు జమ కానున్నాయి.

– నీలాద్రి కృష్ణవేణి, 21వ వార్డు

ప్రభుత్వ సహకారం మరువలేం



నాది 21వ వార్డు నేతాజీ వీధి. పేద కుటుంబం కాగా ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఒక అమ్మాయికి పెళ్లిచేశాం. రెండో అమ్మాయి క్యాన్సర్‌తో బాధపడుతోంది. దీంతో మాకు ఆర్థికంగా అనేక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు కోవిడ్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అందించిన పథకాలు మా కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు మమ్మల్ని ఆర్థికంగా నిలబెట్టాయి. చేయూత ద్వారా లభించిన నిధులతో మా ప్రాంతంలో చికెన్ పకోడిషాపు పెట్టుకున్నాం. ప్రస్తుతం వ్యాపారం బాగానే సాగుతొంది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా మా అమ్మాయి చికిత్స పొందుతోంది. మా కుటుంబం అంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– షేక్ బేబీ, 21వ వార్డు

చేయూత ఆదుకుంది



మాది 23వ వార్డు మద్దిల పాలెం నర్సివారి వీధి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూతతో మా కుటుంబం కుదుటపడింది. ఇప్పటి వరకు మూడు సార్లు నిధులు మంజూరుతో లబ్ధిపొందా. దాంతో పాటు భర్తకు అందుతున్న దివ్యాంగ పెన్షన్‌తో ఇంటి అవసరాలు గడుస్తున్నాయి.

– కంచుబోయిన రామలక్ష్మి, 23వ వార్డు

ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన



సమావేశానికి హాజరైన వైద్యులు

మహారాణిపేట: వేసవి దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేపట్టాల్సిన అత్యవసర చర్యలు, మౌలిక వసతుల కల్పనపై సోమవారం ఆంధ్ర వైద్య కళాశాల సెమినార్ హాలులో హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు. కేజీహెచ్, విక్టోరియా, చెస్ట్, ఈఎన్‌టీ, మెంటల్ కేర్, నేత్ర వైద్యశాల, రాణి చంద్రమణిదేవి ఆస్పత్రుల్లో శానిటేషన్, తాగునీరు, మందులు, అత్యవసర అనుమతులపై చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కేజీహెచ్‌లో నీటి వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. అదనంగా మూడు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ కమిటీకి వివరించారు. విక్టోరియా, చెస్ట్, ఈఎన్‌టీ, మెంటల్ కేర్, నేత్ర వైద్యశాల, రాణి చంద్రమణిదేవి ఆస్పత్రుల్లో సమకూర్చవలసిన అత్యవసర వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అచ్చెంనాయుడు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేశ్ కిషోర్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషా ప్రసాద్, డీఈ మన్మథరావు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెంటెండ్ డాక్టర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, టీబీ ఐడీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల కింద మంటలు వేయవద్దు

పరవాడ: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలో 400 కేవీ, 500 కేవీ, 765 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట వ్యర్థాలను తగులబెట్టడడం, మంటలు వేయడం అత్యంత ప్రమాదకరమని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ టి.సూర్యచంద్రరావు హెచ్చరించారు. రైతాంగం పంట వ్యర్థాలు, చెత్తచెదారాలను విద్యుత్ లైన్ల కింద కాల్చడం వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. విశాఖ నుంచి సూరంపాలెం, రాజమండ్రి, విజయవాడ, చిలకలూరిపేట, తుని, కోటనందూరు, కోటవురట్ల, మాకవరపాలెం, మునగపాక, పరవాడ, రావికమతం, రోలుగుంట, దేవరాపల్లి, వేపాడ, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, జైపూర్(ఒడిశా) వరకు అధిక హైఓల్టేజి వైర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ వైర్ల దిగువన మంట పెట్టడడం వలన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడడమే కాకుండా సమీపంలోని ప్రజలకు, పశువులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సమస్యను గుర్తించి రైతులు విద్యుత్ లైన్ల కింద మంటలు వేయడం మానుకోవాలని సూర్యచంద్రరావు కోరారు.

గంటాకు ఝలక్

- ఆత్మీయ సమావేశంలో చేదు అనుభవం
- ఒక్కొక్కరుగా జారుకున్న కూటమి పార్టీ నేతలు
- మాట్లాడకుండానే వెనుదిరిగిన గంటా

మధురవాడ: ఆయన ప్రతి ఎన్నికల్లో నియోజకవర్గాలు మార్చే నాయకుడు.. గెలిచిన తరువాత ప్రజల గురించి పట్టించుకోని పక్కా కమర్షియల్ పొలిటీషియన్.. ఆయనెవరో ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు.. టీడీపీ ఆఖరి విడతలో భీమిలి టికెట్ పొందిన గంటా శ్రీనివాసరావు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆయనపై సొంతపార్టీ నుంచే కాకుండా జనసేన, బీజేపీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న ఆయనకు కూటమి నేతలు ఝలక్ ఇస్తున్నారు. 5వ వార్డు బొట్టవానిపాలెంలోని వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, జిల్లా నాయకుడు మొల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు, నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేదికపై ఉన్న కూటమి ముఖ్యనేతలంతా మాట్లాడి ఒక్కొక్కరుగా తమ అనుచరులతో కలిసి వెళ్లిపోయారు.

గంటా మాట్లాడే సమయానికి పట్టుమని పదిమంది కూడా లేకపోవడంతో చిన్నబుచ్చుకున్నారు. ఆత్మీయ సమావేశంలో నేతలు, కార్యకర్తల మధ్య సయోధ్య కుదర్చాలనుకునే ఆయనకు ఝలక్ తగిలినట్టయింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడకుండానే వెనుదిరగడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

'గంటా' చీప్ పాలిట్రిక్స్

టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలకు తెరతీస్తున్నారు. టీడీపీ కార్యకర్తలు, కాలనీల్లో సామాన్యులకు కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్టు బిల్డప్ ఇస్తున్నారు. సాక్షాత్తు భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలోనే ఇటువంటివి జరుగుతుంటే ఆ పార్టీ వారు నవ్వుకుంటున్నారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెంలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వార్డులోని నగరంపాలెం, సాయిరాం కాలనీ, పీపీ 1కాలనీ, వైఎస్సార్ కాలనీ, స్వతంత్రనగర్, హుద్‌హుద్ కాలనీ, ఓజోన్ వ్యాలి తదితర ప్రాంతాల్లో మొదటి సారి ఓటు హక్కు పొందినవారికి, సామాన్యులకు, టీడీపీ అభిమానులకు పార్టీ కండువాలు వేసి.. వైఎస్సార్‌సీపీకి చెందిన వారు టీడీపీలో చేరినట్టు బిల్డప్ ఇచ్చారు.

'కూటమి'లో ఫొటో రచ్చ

పవన్ ఫొటో చిన్నగా ముద్రించడంపై టీడీపీ నేతలను నిలదీసిన జనసేన కార్యకర్తలు



పవన్‌కల్యాణ్ ఫొటో కనీకనిపించకుండా ముద్రించిన ఫ్లెక్సీ

ఆనందపురం: భీమిలి కూటమిలో ఫొటో చిచ్చురేపింది. ఫ్లెక్సీపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఫొటో పెద్దది పెట్టి.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఫొటో చిన్నగా ముద్రించడంపై ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ త్యాగం వల్లే భీమిలి సీటు టీడీపీకి కేటాయించిన విషయాన్ని మర్చిపోతే తేడాలు వస్తాయని తెలుగుదేశం నాయకులను హెచ్చరించారు. ఈ ఫొటో వెనుక ఏం జరిగిందంటే.. మండలంలోని పెద్దిపాలెంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో సోమవారం భీమిలి నియోజకవర్గం టీడీపీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓ పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలో చంద్రబాబు ఫొటో పెద్దది వేసి, పవన్ ఫొటోను రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో కలిసి చిన్నదిగా ముద్రించారు. ఇది గమనించిన జనసేన కార్యకర్తలు గొడవకు దిగారు. తమ అధినేత త్యాగం వలనే భీమిలి టికెట్ టీడీపీకి కేటాయించారని, అటువంటిది పవన్ ఫొటో చిన్నగా ఎలా వేస్తారని టీడీపీ నేతలను నిలదీశారు. దీంతో కంగుతిన్న టీడీపీ నాయకులు వెంటనే పవన్ పెద్ద ఫొటోను తెచ్చి ఫ్లెక్సీపై అతికించారు. పనిలోపనిగా ప్రధాని మోదీ ఫొటో కూడా పెద్దది తీసుకొచ్చి అతికించారు. కూటమి నేతల్లో సఖ్యత లేదనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదని సమావేశంలో పాల్గొన్నవారే గుసగుసలాడారు.

సదరన్ రీజనల్ పవర్ కమిటీ సమావేశం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీసీ కార్యదర్శి అజిత్ సింగ్.. దక్షిణ ప్రాంతంలో గ్రిడ్‌కు సంబంధించిన ఆటంకాలు, గ్రిడ్ సంఘటనలు, ద్వీప పథకం, ఇతర సమస్యలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలోని విద్యుత్ సంస్థల తరఫున హాజరైన 33 మంది అధికారులతో సమీక్షించారు. అనంతరం సమావేశానికి హాజరైన వివిధ ప్రాంతాల విద్యుత్ సంస్థల ప్రతినిధులు ఎన్టీపీసీ నిర్వహిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, సీ వాటర్ పంప్ హౌస్‌ను సందర్శించారు. ఈ సమావేశంలో సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్ఆర్‌పీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మేకా రామకృష్ణ, జీఎంవో అండ్ ఎస్.జె.డేవిడ్, జీఎం ఆపరేషన్ టి.ఆర్.రాజగోపాలన్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో జీతాల చెల్లింపుపై ఉద్యోగుల ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జీతాల చెల్లింపుపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ లాభాల్లో ఉన్నప్పటికీ ఒకటో తేదీన జీతాలు చెల్లించాల్సి ఉండగా..సోమవారం మార్చి నెల జీతాలు చెల్లించారు. అదికూడా 15 రోజుల జీతం మాత్రమే ఉద్యోగులు అకౌంట్లలో జమ చేయడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గత కొన్ని నెలలుగా జీతాల చెల్లింపులో రకరకాలుగా వ్యవహరిస్తోంది. మార్చి నెలలో సుమారు రూ. 2500 కోట్లు అమ్మకాలు జరగగా అదే నెలలో జరిగిన రాయబరేలి వీల్‌ప్లాంట్ అమ్మకం, నగరంలోని హెచ్‌బీ కాలనీ ఫేస్–1 భూములు అమ్మకం జరిగింది. అయినప్పటికీ ఒకటో తేదీన జీతాలు చెల్లించకపోవడం, ఆలస్యంగా 8వ తేదీన కూడా 15 రోజుల జీతం చెల్లించడం వ్యూహాత్మకమని భావిస్తున్నారు. జీతాల చెల్లింపు అంశంలో గుర్తింపు యూనియన్ వైఖరిపై కార్మికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు అప్పన్న పెళ్లిరాట

- ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహణ
- సాయంత్రం మూలవిరాట్‌ని తాకనున్న సూర్యకిరణాలు

సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి పెళ్లిరాట(ఉడుపురాట) మహోత్సవం జరగనుంది. ఇందు కోసం ఆలయ, వైదిక వర్గాలు ఏర్పాట్లు చేశాయి. ఈ నెల 19న చైత్రశుద్ధ ఏకాదశి రోజు స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహణలో భాగంగా ఈ వేడుక నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి సింహాచలం దేవస్థానం అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టింపజేసి, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ఉత్తర ద్వారం, రాజగోపురం, నృసింహ మండపంలో పెళ్లిరాటలు వేస్తారు. తరువాత ఉగాది పండిత సత్కారాలు, దాతలకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేయనున్నారు. అలాగే మాడవీధుల్లో తిరువీధి జరపనున్నారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సూర్యకిరణాలు శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌ను తాకనున్నాయి.

ముస్లింల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం


వైఎస్సార్‌సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, చిత్రంలో ఖాదర్ బాషా తదితరులు

తాటిచెట్లపాలెం: ముస్లింల సంక్షేమానికి, వారి రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా తెలిపారు. సోమవారం రైల్వే న్యూకాలనీలోని సింకా హోటల్‌లో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గాజువాక ఎన్నికల పరిశీలకుడు ఐహెచ్ ఫారూఖీ ఆధ్వర్యంలో విశాఖలోని ఏడు నియోజకవర్గాల మసీదుల ఇమాములతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖాదర్‌బాషా, హాఫీజ్‌ఖాన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుది ద్వంద్వ వైఖరి అని, తన పదవీకాలంలో ముస్లింల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. ముస్లింలకు వ్యతిరేకంగా సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లులు తీసుకొచ్చిన బీజేపీకి మద్దతు తెలిపి ముస్లింలకు ద్రోహం చేశారని విమర్శించారు. 2019లో బీజేపీని వ్యతిరేకించి, ఇపుడు మళ్లీ అదే పార్టీతో ఎన్నికల్లో లబ్ధి పొందాలని పొత్తులకు బరి తెగించారన్నారు. 2014–19వరకు ముస్లింలను పూర్తిగా విస్మరించిన చంద్రబాబు ఇప్పుడు ముస్లింలను ఉద్ధరిస్తానంటూ ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు పదవులు ఇవ్వడంతో పాటు వారి సంక్షేమానికి గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నిధులు కేటాయించారన్నారు. ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు అనేక కార్పొరేషన్ పదవులు ఇచ్చి గౌరవించారని, రానున్న ఎన్నికల్లో జగన్‌మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా బీజేపీ ప్రవేశపెట్టిన ఎన్ఆర్‌సీ, సీఏఏ బిల్లులకు జగన్‌మోహనరెడ్డి పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం కూడా జరిగిందని తెలిపారు. అధికారం కోసం, కేవలం తన వర్గం వారి మనుగడ కోసమే చంద్రబాబు నేడు బీజేపీతో అంటకాగుతున్నాడని మండిపడ్డారు. మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఫరూఖీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వీరంతా అభ్యున్నతి సాధించారన్నారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, నగర ఖాజీ అహ్మదుల్లా ఖాన్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఇమామ్‌లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.7.84 లక్షల స్వాధీనం



నగదుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్, ద్వారకా పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు యువకులు వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై వెళుతుండగా తనిఖీ చేశారు. ఈక్రమంలో క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ సంస్థకు చెందిన ఎల్.భాగ్యరాజ్ బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు రూ.4,14,542 తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. అలాగే రేడియంట్ సంస్థకు చెందిన ఉద్యోగి శివసాయి చరణ్ వద్ద రూ.3,70,000 స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరిద్దరి వద్ద నగదుకు సంబంధించి అన్ని రశీదులు ఉన్నాయి. అయినప్పటికీ నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న నగదును నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ద్వారకా సీఐ, రమేష్, ఫ్లయింగ్ స్క్వాడ్ స్కాడ్ ఇన్‌చార్జు లోవరాజు తనిఖీల్లో పాల్గొన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కారును ఎస్ఐ.ధర్మేంద్ర, ఎఎస్ఐ, గంగాధర్‌రెడ్డి, కేంద్ర బలగాలు తనిఖీలు చేశారు.

నగరాలకు జనసేన అన్యాయం

ఏపీ నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు

మధురవాడ: నగరాల సామాజిక వర్గానికి జనసేన పార్టీ అన్ని విధాలుగా అన్యాయం చేసిందని ఏపీ నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న నగరాల కులానికి చెందిన పోతిన మహేష్‌కు టికెట్ ఇవ్వకుండా పవన్ కల్యాణ్ కూటమి పేరు చెప్పి నమ్మించి నట్టేట ముంచారన్నారు. దీన్ని నగరాల కులస్తులతో పాటు బీసీ సామాజిక వర్గం అంతా తమకు జరిగిన అన్యాయంగా భావిస్తున్నారన్నారు. బీసీ సంక్షేమమే ధ్యేయమని చెప్పుకునే జనసేన పార్టీకి ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

నేడు ఆరుగురు అర్చకులు, వేదపండితులకు సత్కారం

మహారాణిపేట: ఉగాది సందర్భంగా పలువురు అర్చకులు, వేద పండితులను సత్కరించనున్నామని జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ (ఏసీ) కె.శిరీష తెలిపారు. జిల్లాలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న ఆరుగుర్ని గుర్తించామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు నియమ నిబంధనలను అనుగుణంగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించే ఉగాది సంబరాల్లో అర్చకులు కె.అనంత వేంకట వరాహ కృష్ణమాచార్యులు,బుచ్చమ్మ, వి.నరసింహాచార్యులు, కె. శ్రీనివాస శర్మ, వాడపల్లి గోపాలాచార్యులు, కోటా పంచముఖి శర్మలను సత్కరించనున్నామన్నారు. సత్కారగ్రహీతలకు రూ.10,116 అందజేస్తామని చెప్పారు.